సంపుటి :02 సంచిక :277 పేజీలు :06
వెల ₹1
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



## ప్రతి ఒక్కరికి న్యాయం

ప్రజల నుంచి వినతులను స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

02

సోమవారం 13, జనవరి 2026



## డిజిటల్ అరెస్ట్ యమ డేంజర్ !

### సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల పోస్టులు నమ్మొద్దు
- గడచిన రెండు వారాల్లో పడగ విప్పిన సైబర్ నేరగాళ్ల ముఠా
- హైప్రొఫైల్ కుటుంబాలు టార్గెట్.. వారి ఖాతాల్లో రూ.కోట్ల డబ్బు హుష్
- బాధితుల్లో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సతీమణి కూడా
- అప్రమత్తంగా ఉండకపోతే.. ఇంక అంతే సంగతులు

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సతీమణి ఊర్మిళ ఈ నెల మొదటి వారంలో డిజిటల్ అరెస్ట్ బారినపడ్డారు. రూపాయి కాదు.. రెండు రూపాయలు కాదు.. ఏకంగా రూ.2.58 కోట్లు పోగొట్టుకున్నారు. స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా వేసిన గాలానికి ఆమె చిక్కారు. నేరస్థులు సూచించిన నకిలీ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. తర్వాత వర్చువల్ నకిలీ ఖాతాలో భారీగా లాభాలు వచ్చినట్లు ఆమెకు కపించింది. కానీ, అవి విత్ డ్రా చేయబోగా.. బదిలీ కాలేదు. దీంతో ఆమె తాను మోసపోయానని గుర్తించారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

2



## రామప్ప వద్ద అగ్నిప్రమాదం


- మంటల్లో అరుదైన కేన్ మొక్కలు దగ్ధం
- గంటల పాటు శ్రమించి మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది
- ఊపిరి పీల్చుకున్న ఫారెస్ట్ అధికారులు
- ప్రమాదంపై లోతైన విచారణ

5

## ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

3






## జ్యుడీషియల్ కమిటీ

- జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేస్తామని వెల్లడి
- ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 3.64 శాతం పెంపు
- టీజీవో డైరీ ఆవిష్కరణ సభలో ప్రకటన

02

## తుది ఓటరు జాబితా వెల్లడి

2



అక్షర దర్బార్ Voice of the people



# డిజిటల్ అరెస్ట్ యమ డేంజర్ !

- సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల పోస్టులు నమ్మొద్దు
- గడచిన రెండు వారాల్లో పడగ విప్పిన సైబర్ నేరగాళ్ల ముఠా
- హైప్రొఫైల్ కుటుంబాలు టార్గెట్.. వారి ఖాతాల్లో రూ.కోట్ల డబ్బు హుష్
- బాధితుల్లో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సతీమణి కూడా
- అప్రమత్తంగా ఉండకపోతే.. ఇంక అంతే సంగతులు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి**

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సతీమణి ఊర్మిళ ఈ నెల మొదటి వారంలో డిజిటల్ అరెస్ట్ బారినపడ్డారు. రూపాయి కాదు.. రెండు రూపాయలు కాదు.. ఏకంగా రూ.2.58 కోట్లు పోగొట్టుకున్నారు. స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా వేసిన గాలానికి ఆమె చిక్కారు. నేరస్థులు సూచించిన నకిలీ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. తర్వాత వర్చువల్ నకిలీ ఖాతాలో భారీగా లాభాలు వచ్చినట్లు ఆమెకు కపించింది. కానీ, అవి విత్ డ్రా చేయబోగా.. బదిలీ కాలేదు. దీంతో ఆమె తాను మోసపోయానని గుర్తించారు.
- ఢిల్లీకి చెందిన ఒక విశ్రాంత ఐఏఎస్ అధికారి కుమార్తెను ఇటీవల సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ చేశారు. తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులమని, ఆమె పేరుతో థాయిలాండ్ వెళ్తున్న పార్సిల్‌లో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్టులు దొరికాయని భయపెట్టారు. సీబీఐ, సుప్రీంకోర్టు లోగోలతో ఉన్న నకిలీ పత్రాలను వాట్సాప్ చేసి సుమారు 48 గంటల పాటు ఆమెను వీడియో కాల్‌లోనే ఉంచారు. ఆమెను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేశారు. పరువు పోతుందన్న భయంతో ఆమె సుమారు 1.20 కోట్లను సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి మళ్లించారు.
- చండీగఢ్ కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి తండ్రి సైతం తాజాగా ఇలాగే డిజిటల్ అరెస్ట్ బారిన పడ్డాడు. ఆయనకు కాల్ చేసిన సైబర్ ముఠా ఆయన కుమారుడు ఒక లైంగిక దాడి కేసులో పట్టుబడ్డాడని, ఆ కేసు నుంచి తప్పించాలంటే తక్షణం డబ్బులు సెటిల్ చేయాలని బెదిరించారు. కుమారుడికి ఫోన్ చేసే అవకాశం ఇవ్వకుండా నిరంతర కాల్స్ చేసి ఒత్తిడికి గురిచేశారు. బాధితుడి నుంచి లక్షలాది రూపాయలు కాజేశారు.

ఇలా.. గడిచిన రెండు వారాల్లోనే దేశవ్యాప్తంగా ఎందరో హైప్రొఫైల్ కుటుంబాలకు చెందిన వ్యక్తులు సైబర్ నేరగాళ్ల బారినపడ్డారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులనే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. వారి నుంచి కోట్లకు కోట్లకు డబ్బులు కొల్లగొడుతున్నారు. కేవలం సాంకేతికతను వినియోగించి, బాధితులను మానసిక స్థితిని కుంగదీసి ఇలాంటి నేరాలకు పాల్పడుత ున్నారు. నకిలీ పెట్టుబడులు, డిజిటల్ అరెస్టుల ఉచ్చులో చిక్కుకోకుండా ఉండాలంటే ఎంతో అప్రమత్తత అవసరం. గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా పంపే స్టాక్ మార్కెట్ సలహాలను, లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదు. సెబీ గుర్తింపు పొందిన ప్లాట్‌ఫాంలోనే పెట్టుబడులు పెట్టాలి. ఏ ప్రభుత్వ సంస్థ లేదా దర్యాప్తు సంస్థ వీడియో కాల్ ద్వారా అరెస్టులు చేయదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. నగదు కూడా డిమాండ్ చేయదు.

## - మరిన్ని సూచనలివి..

అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి బ్యాంక్ అధికారులుగానీ, పోలీస్ అధికారులుగానీ ఎప్పుడూ మీ వ్యక్తిగత సమాచారం అడగరని గుర్తుంచుకోవాలి. పిన్ నంబర్లు లేదా ఓటీపీ వివరాలు అడగరని గుర్తుంచుకోవాలి. ఎవరైనా మిమ్మల్ని భయపెట్టాలని చూసినా, అత్యవసరంగా డబ్బులు పంపాలని ఒత్తిడి చేసినా అది మోసమని గ్రహించాలి. మీ స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా ఖాతాల భద్రత విషయంలో రాజీ పడకూడదు. అన్ని ముఖ్యమైన అకౌంట్లకు 'టూ–స్టెప్ వెరిఫికేషన్' తప్పనిసరిగా ఆన్ చేసుకోవాలి. దీనివల్ల మీ పాస్‌వర్డ్ ఇతరులకు తెలిసినా మీ అనుమతి లేకుండా ఖాతా తెరవడం సాధ్యం కాదు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఉండే ఉచిత వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించి బ్యాంకింగ్ లావాదేవీలు చేయొద్దు. మీ ఫోన్‌లోని ఆపరేటింగ్ సిస్టమ్, యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి. కేవలం వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే సమాచారాన్ని నమ్మి తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు. మీ ఆధార్ కార్డు లేదా బ్యాంక్ వివరాలు అపరిచిత వెబ్‌సైట్లలో నమోదు చేసే ముందు ఆ సైట్ చిరునామా సరిగ్గా ఉందో లేదో తనిఖీ చేయాలి. గుర్తుతెలియని నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ఒకవేళ మోసం బారిన పడితే తక్షణం 1930 అనే హెల్ప్‌లైన్ నంబర్ కు కాల్ చేయాలి.




# నిషేధిత గంజాయి పట్టివేత

## – ఇద్దరు నిందితుల అరెస్టు

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం: భూపాలపల్లి పట్టణంలో నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్యేక నార్కోటిక్ డ్రగ్ టీం తనిఖీలలో, బస్టాండ్ సమీప కూరగాయల మార్కెట్ వద్ద కుంట శివ (31), ఉర్సు దిలీప్ కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ ద్వారా వారి వద్ద 1.65 కిలోగ్రాములు నిషేధిత గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. భూపాలపల్లి పోలీస్ శాఖ ఆద్వర్యంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు. ప్రజలను ఏవైనా సమాచారం తెలిస్తే 8712658111 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా అందించాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# తుది ఓటరు జాబితా వెల్లడి

అక్షరదర్బార్, వర్ధన్నపేట: రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులకు సంబంధించిన తుది ఓటరు ఫొటో జాబితాను సిద్ధం చేసి ప్రచురించినట్లు మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ సోమవారం వెల్లడించారు. ఈ జాబితాను వరంగల్ ఆర్డీవో కార్యాలయం, వర్ధన్నపేట తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయం నోటీస్ బోర్డులపై అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.



# జ్యుడీషియల్ కమిటీ

- జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఏర్పాటు చేస్తామని వెల్లడి
- ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 3.64 శాతం పెంపు
- టీజీవో డైరీ ఆవిష్కరణ సభలో ప్రకటన



అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై అధ్యయనానికి ఒక విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ రూపొందించిన డైరీని సోమవారం ఆయన హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేసిందని, దీంతో పరిపాలన పరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. జిల్లాల సరిహద్దుల మార్పుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేయబోయే కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ పాలనలో ఉద్యోగులే నిజమైన సారథులని, 10.50 లక్షల మంది ఉద్యోగుల భాగస్వామ్యంతోనే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని ముఖ్యమంత్రి కొనియాడారు. కేవలం 200 మంది ప్రజాప్రతినిధులు మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, యంత్రాంగం మొత్తం సమర్థంగా పనిచేసినప్పుడే లక్ష్యాలు నెరవేరుతాయని వివరించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని, విశ్రాంతి తీసుకుందామని భావించినా ఏదో ఒక ప్రజా సమస్య తన ముందుకు వస్తోందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏ దస్త్రాలపై సంతకం చేసిన తర్వాతే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

# ప్రతి ఒక్కరికి న్యాయం

- ప్రజల నుంచి వినతులను స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

అక్షరదర్బార్, హనుమకొండ: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సోమవారం హనుమకొండ రామ్ నగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు ఆయనకు తమ సమస్యలను విన్నవించారు. వారి సమస్యలపై మురళి సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని వారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని కూడా వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కొండా మురళి అన్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం

అక్షర దర్బార్, భూపాలపల్లి : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 46 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చే ప్రజావాణి నాటికి అన్ని దరఖాస్తులు పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి వస్తున్నందున అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని, దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# సబ్సిడీ ఎత్తివేసే ప్రయత్నాలను నిరసించాలి

అక్షర దర్బార్, వరంగల్ : రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ వాపోయారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశీ వ్యవసాయాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని, రైతులకు అవసరమైన యూరియాను సరిపడా అందించకుండా సబ్సిడీని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఖాళీగా ఉన్న వ్యవసాయ అధికారులు పోస్టులను నింపి, భూసార పరీక్షలు, సరైన సూచనలు అందించాలని, రాబోయే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ ఈనెల 20న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యవసాయ అధికారుల (జేడీఏ) ఆఫీసుల వద్ద ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తూ వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించింది. సమావేశంలో రాష్ట్ర నాయకులు వి. తుకారాం నాయక్, కుసుంబా బాబురావు, వక్కల కిషన్, ఎండి ఇస్మాయిల్, సింగతి మల్లికార్జున్, మాదాసు ఆదిరెడ్డి, ఇట్టమల్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదే లే..!

- బయటపడ్డ బీజేపీ అంతర్గత విభేదాలు
- మాజీ ఎంపీ ముందే తిట్ల దండకం



అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణంలో సోమవారం నిర్వహించిన బీజేపీ మున్సిపల్ సన్నాహక సమావేశం పార్టీ అంతర్గత విభేదాలకు అద్దంపట్టింది. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తున్న సమయంలోనే బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చెలరేగి, పరస్పర ఆరోపణలు, తిట్ల దండకంగా మారాయి.

### ఒకరిపై ఒకరు ఆరోపణలు

పరకాల పట్టణానికి చెందిన ఒక బీజేపీ నాయకుడి వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని, పార్టీకి చెడ్డ పేరు వస్తోందని దామెర మండలానికి చెందిన మరో ముఖ్య నేత వ్యాఖ్యానించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరకాల భ్రష్టపడుతోందంటూ ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటూ బూతులు తిట్టుకోవడంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది.

### నివ్వెరబోయిన జిల్లా నాయకులు

ఈ పరిణామాలతో సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు. పార్టీ శ్రేణులు జోక్యం చేసుకుని సద్దుమణిగించేందుకు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

### సద్దుమణిగిన వివాదం

చివరకు దామెర మండలానికి చెందిన ఓ నాయకుడిని పార్టీ శ్రేణులు సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లడంతో పరిస్థితి కొంత మేరకు సద్దుమణిగిందని తెలిసింది. అయితే ఈ ఘటన బీజేపీ పరకాల పట్టణంలో నెలకొన్న అంతర్గత విభేదాలను బహిర్గతం చేసిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# రామప్ప హుండీ లెక్కింపు

## రూ.6,71,954 ఆదాయం



అక్షర దర్బార్, వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న ప్రసిద్ధ రామప్ప దేవాలయంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.6,71,954 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కుమారస్వామి, వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు, పాలంపేట సర్పంచ్ చల్లగొండ రాజు, ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్‌తో పాటు పోలీసు, ఆలయ సిబ్బంది, శ్రీ వల్లి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# CRPA TG నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక



అక్షరదర్బార్, మరిపెడ : హైదరాబాద్‌లోని టీఎన్‌జీవో భవనంలో CRPA TG రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీతారాంపూర్ కాంప్లెక్స్ CRP మారగాని జానకిరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు రేగుల సహదేవ్, మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రవీందర్ నేతృత్వంలో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా మరిపెడ మండల శాఖ అధ్యక్షుడు కీసర రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్, సీర్పీలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



# పరకాలలో బీజేపీ జెండా ఎగరాలి

## మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డులన్నీ బీజేపీ గెలవాలన్న లక్ష్యంతో కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ ఎంపీ, హనుమకొండ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ డా. బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు. పరకాలలో నిర్వహించిన బీజేపీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి వార్డుకు ఇన్‌చార్జులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి పబ్లిసిటీ ఎక్కువ, పని తక్కువని విమర్శించారు. ప్రధాని మోదీ పాలనలో పథకాల లబ్ధి నేరుగా ప్రజలకు చేరుతోందని తెలిపారు. సమావేశంలో జిల్లా, రాష్ట్ర స్థాయి బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో చందుపట్ల రాజేందర్ రెడ్డి ఆర్పి జయంత్ లాల్ కొలంనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి ,సంఘ పురుషోత్తం, ఎర్ర రామన్న ,బాసాని సోమరాజు, మార్త బిక్షపతి, మేకల రాజవీరు, కుక్కల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రణమ్ డే కేర్ సెంటర్ ప్రారంభం

అక్షర దర్బార్, ములుగు : వయోవృద్ధుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రణమ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను సోమవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ డే కేర్ సెంటర్‌ను దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు (ప్రభుత్వ సెలవులు మినహా) వయోవృద్ధులకు వినోద, క్రీడా కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి తులా రవి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జి. శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్. సతీష్, కార్యదర్శి సిహెచ్. రమేష్, జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు సిహెచ్. ఐలయ్య, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ నాగేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోరమండల్ గ్రోమోర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అక్షర దర్బార్, వెంకటాపూర్ : కోరమండల్ గ్రోమోర్ కంపెనీ ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండల కేంద్రంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు కంపెనీ ఉత్పత్తులను అందమైన ముగ్గుల రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ విజేతలైన వినీత, నవత, దివ్యలకు బహుమతులు అందించారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు కంపెనీ ప్రతినిధులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్లు హుస్సేన్ బాషా, బిక్షపతి, ఫీల్డ్ స్టాఫ్ దిలీప్, గఫర్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్ర నిర్వాహకులు రెడ్డి పవన్, రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఏజెన్సీ హక్కుల కోసం నేతకాని కులస్థుల ధర్నా

అక్షర దర్బార్, ములుగు : ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న నేతకాని కులస్థులకు ఏజెన్సీ హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఏజెన్సీ నేతకాని సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘం జిల్లా నాయకులు జాడి రమేష్, సెగ్గం రమణకర్ నాయకత్వం వహించగా, ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఈశ్వర్ నేతకాని, గౌరవ అధ్యక్షుడు దుర్గం సమ్మయ్య నేతకాని హాజరయ్యారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టరేట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేతకాని సంఘం నాయకులు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న నేతకాని కులస్థులకు ఏజెన్సీ చట్టాలు, హక్కులు పూర్తిస్థాయిలో వర్తించేలా చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ నేతకాని అభివృద్ధి సంస్థను రూ.2000 కోట్లతో ఏర్పాటు చేయాలని, సాగుభూములకు హక్కు పత్రాలు, విద్యా–ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 1/70 యాక్ట్, పీసా చట్టాల్లో నేతకాని కులస్థులను భాగస్వాములుగా చేర్చాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు.

# మోడీ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

అక్షర దర్బార్, పరకాల : మోడీ సర్కార్ కార్మికులు, రైతు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో పరకాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ.. కార్మికులు సాధించుకున్న చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చుతున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచడమే కాక, విద్యుత్ సంస్కరణ బిల్లులతో రైతులు, ప్రజలపై భారం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సీఐటీయూ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ ఘన ప్రారంభం

అక్షర దర్బార్, పరకాల: గణపతి ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను పరకాల సీఐ క్రాంతి కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి బందారి గిరిప్రసాద్, మునావత్ రమేష్‌లు దక్కించుకోగా, రెండో బహుమతిని మారపెల్లి రణధీర్, మద్దెల దామోదర్‌లు సొంతం చేసుకున్నారు. 45 ప్లస్ విభాగంలో తొలి బహుమతి సుధమల్ల అనిల్ కుమార్, దామోదర్‌లకు లభించగా, రెండో బహుమతి రాజు, ఆజాద్‌లకు దక్కింది.వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారులకు గణపతి ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజ్జు, బాలకృష్ణ, నాగరాజ్, సాయికృష్ణ, వెంకన్న, దేవేందర్, ప్రకాష్, సాయి, చందు, బంటి, వర్ధన్, అశోక్, సురేష్, మార్కండేయ, శ్రీధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క-The Glory of Medaram పుస్తకం ఆవిష్కరణ

అక్షర దర్బార్, ములుగు : మేడారం జాతరపై గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, భక్తుల అనుభవాలు, మీడియా నిర్వహణ అంశాలను సమగ్రంగా విశ్లేషించిన “సమ్మక్క – The Glory of Medaram” పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం మేడారంలో ఆవిష్కరించారు. పుస్తక రచయిత వరంగల్ పూర్వ జిల్లా పౌర సంబంధాల అధికారి, ప్రస్తుతం సమాచార–పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నకండి వెంకటరమణ. ఆయన 1994 నుండి మేడారం జాతరలో పీఆర్ఓ విధులు నిర్వహిస్తూ, జాతరలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, మీడియా కవరేజీ అనుభవాలను సేకరించగా, వీటిని పుస్తకంలో సమకూర్చారు. కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, మేడారం వద్దే పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ డిపిఆర్ఓ రఫీ తదితరులు పాల్గొన్నారు.





# నూతన సర్పంచులకు శిక్షణ




అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులు 80 శాతం కొత్తవారు కావడం, పంచాయతీరాజ్ చట్టంపై నూతన సర్పంచులకు అవగాహన లేకపోవడంతో ఎన్నికైన సర్పంచులకు గ్రామ పరిపాలనపై పూర్తిస్థాయిలో శిక్షణ అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు సీఎం ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాకు చెందిన జిల్లా పంచాయతీ అధికారులతో పాటు ఎంపీడీవోలు, ముగ్గురు ఎంపీవోలు, ఒక ఈజీఎం ఎంలకు ఈ నెల 4వ తేదీ నుంచి అయిదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.వీరి ద్వారా జిల్లా వ్యాప్తంగా ఎన్నికైన సర్పంచులకు అవగాహన కల్పించనున్నారు. సంక్రాంతి తర్వాత మండలాల వారీగా విభజించి అయిదు రోజుల పాటు అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా నూతన సర్పంచులకు గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, నిధులు, ఖర్చు, ప్రజలకు అందాల్సిన పంచాయతీ సేవలు, పన్నుల వసూళ్లు, సర్పంచి విధులు, బాధ్యతలతో పాటు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని అంశాలు, తదితర అంశాలపై వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. యువ సర్పంచులు, అవగాహన లేనివారికి ప్రయోజనం చేకూరనుంది. శిక్షణకు సర్పంచులుగా ఎన్నికైన మహిళలంతా తప్పనిసరిగా హాజరుకావాలి. అలా కాకుండా వారి భర్తలు, కొడుకులు హాజరైతే సర్పంచి అవగాహన లేమితో ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలా జరగకుండా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**ఆదేశాలు రాగానే చర్యలు**

కొత్తగా ఎన్నికైన సర్పంచులకు అవగాహన కల్పించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు మొగుళ్ళపల్లి ఎంపీడీవో సురేందర్ గౌడ్ తెలిపారు ఉన్నత అధికారాలనుండి ఆదేశాలు రాగానే సర్పంచులకు శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

# మైలారంలో పశువైద్య శిబిరం



అక్షర దర్బార్, శాయంపేట : జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శాయంపేట మండలం మైలారం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నూనె దివ్య తిరుపతి ప్రారంభించారు. ఈ శిబిరంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ సునీల్ పాల్గొని రైతులు గోపాలమిత్రుల సేవలను వినియోగించుకోవాలని, పశువులు యదకు వచ్చిన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు. శిబిరంలో 48 పాడి పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ ప్రకాష్ రెడ్డి, గోపాలమిత్రులు సుదర్శన్, రంజిత్, సతీష్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# మొట్లపల్లి గ్రామసభ విజయవంతం

**- 16 అంశాలపై చర్చ**

**- రెండు ఏకగ్రీవ తీర్మానాలకు ఆమోదం**

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: మొగుళ్ళపల్లి మండలం మొట్లపల్లి గ్రామసభ సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో వాడి వేడిగా జరిగింది. గ్రామసభలో సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి అధ్యక్షతన పలు అంశాలపై చర్చించారు, గ్రామంలోని 16 ప్రధాన సమస్యలపై చర్చ జరగగా.. రెండు అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. మహిళ సమాఖ్య భవనానికి స్థలం కేటాయిస్తూ గ్రామపంచాయతీ తీర్మానం చేయగా మొట్లపల్లి గ్రామ చెరువు పై వచ్చే ఆదాయాన్ని గ్రామ చెరువు అభివృద్ధి కోసం కేటాయించాలని గ్రామసభ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి సుజాత, సర్పంచ్ నరహరి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ ఆళ్లముత్యం రెడ్డి, వార్డు సభ్యులు నాగపురి శ్రీనివాస్, దేగ రమేష్, కుక్కమూడి రవి, ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు రఘుపతి రెడ్డి, గ్రామ పెద్దలు చిలుకూరి జగన్ రెడ్డి చిలుకూరి రాజిరెడ్డి గూడూరి సదన్ రెడ్డి గూడూరి శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ బాలరాజు. మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, జన్నె లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, రాధిక, ఆశా వర్కర్లు మమత కరోబార్ వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



అక్షర దర్బార్, చిట్యాల : దళిత మహిళపై దాడి చేసిన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన గుండారపు చైతన్య పై SC/ST అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని అంబేద్కర్ రాష్ట్ర యువజన సంఘం ఆర్గనైజర్ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగేందర్, నాయకుడు గురుకుంట్ల కిరణ్ తో కలిసి మాట్లాడుతూ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని, గతంలో నిందితులను కఠినంగా శిక్షించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని అన్నారు. అధికారులు వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నర్సంపేటలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

**కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ లోకి కీలక నేత**

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్న అసంతృప్తితో కీలక నేతలు ఆ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కలపల్లి రవీందర్ రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో రవీందర్ రావును బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కేసీఆర్ పాలనలో నర్సంపేట నియోజకవర్గం శాంతి, సంక్షేమం, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగిందని, ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



# ప్రజల్లో ఉన్నోళ్లకే ప్రాధాన్యత

- ఈ నెలలో ప్రతి డివిజన్లో ఒకరోజు పర్యటన
- 26 డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే నాయిని



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం, పార్టీ రెండు కళ్ల సిద్ధాంతాన్ని అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం, కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ గత రెండేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరంగా అమలు చేస్తూ ప్రజల మధ్య ఉంటున్నామని చెప్పారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని బూత్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని అన్నారు.

ఈ నెలలో ప్రతి డివిజన్‌లో ఒక రోజు చొప్పున పర్యటన చేపడతానని, ఇందులో భాగంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆయా డివిజన్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. భోజనం అనంతరం కుల పెద్దల ఇళ్లలో టీ బ్రేక్ ఉంటుందని, ఆ సమయంలో గ్రూప్ రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండాలని అన్నారు. ఎవరు కష్టపడి పనిచేస్తారో, ప్రజల్లో ఉంటారో వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో కుల, జనాభా ప్రాతిపదికన టికెట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు.

నియోజకవర్గంలో 7 ఎకరాల భూమిని గుర్తించామని, అందులో సుమారు 3,500 ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఉందని తెలిపారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ, ఇంటర్నల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక పనులు చేశామని, ఈ అభివృద్ధిని ప్రజలకు చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. ఎవరో చెప్పారని కార్పొరేటర్ టికెట్ అడగకూడదని, ముందుచూపుతో డివిజన్ అధ్యక్షులను బలోపేతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, ఆర్టీఏ సభ్యులు పల్లకొండ సతీష్, జిల్లా అనుబంధ సంఘాల చైర్మన్లు బంక సరళ, విక్రమ్, రాజ్ కుమార్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సెగ్గంపల్లిలో శ్రీ రామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులకు, జంగేడులో మడేలయ్య, శ్రీ రామాలయ నిర్మాణ పనులకు, రాంనగర్ లో దర్గా వద్ద ప్రహరీ గోడ నిర్మాణ పనులతో పాటు రూ.150 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, ఇతర ముఖ్య నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్ పరిపాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే భూపాలపల్లి మున్సిపాలిటీని ఆదర్శంగా నిలబెట్టవచ్చని సత్యనారాయణరావు పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 30 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.



## మహాజాతర బ్రోచర్ ఆవిష్కరణ

అక్షరదర్బార్, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మేడారం సమ్మక్క –సారలమ్మ మహా జాతర బ్రోచర్, పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 13 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

అక్షరదర్బార్, పరకాల: యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి ఈనెల 13 నుంచి 15 వరకు హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామంలో జిల్లా స్థాయి గ్రామీణ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీ స్వామి వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ గుండెబోయిన రాజు, ఆర్గనైజర్స్ అన్నారెడ్డి, అభిషేక్, సభ్యులు ఒక ప్రకటనలో వెల్లడించారు. కేశవ విద్యానికేతన్ వ్యవస్థాపకులు, ప్రధానోపాధ్యాయులు జనపాల గోవర్ధన్ స్మారకార్థం మూడు రోజులపాటు కంఠాత్మకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ పోటీలు నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ పోటీలు కనుమరుగవుతున్న క్రీడా పోటీలకు జీవం పోయటానికి, ఉత్సాహవంతమైన, ప్రతిభావంతులైన యువకులకు ఒక మంచి అవకాశాన్ని తీసుకొస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వాలీబాల్ క్రీడాకారులు తమ జట్లను నమోదు చేసుకోవడానికి వాట్సాప్ లేదా ఫోన్ ద్వారా శ్రీ స్వామి వివేకానంద ఫౌండేషన్ ఆర్గనైజర్స్ అన్నారెడ్డి, అభిషేక్ ను సంప్రదించాలని గుండెబోయిన రాజు కోరారు. వాలీబాల్ పోటీల విజేతలకు ఫస్ట్ ప్రైజ్ రూ.10 వేలు, సెకండ్ ప్రైజ్ రూ.5 వేలుగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

## మినీ మేడారం జాతర ను ఘనంగా నిర్వహిస్తాం

**- కాంగ్రెస్ పులి వీరారెడ్డి**



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను మొగుళ్ళపల్లి ములకలపల్లి గ్రామ మధ్య పెద్దవాగు వద్ద ప్రతి రెండు సంవత్సరలకు ఒకసారి నిర్వహించే మినీ మేడారం జాతరను ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి వీరారెడ్డి తెలిపారు సోమవారం ఆయన అక్షర దర్బార్ విలేకరితో మాట్లాడుతూ.. సోమవారం దేవదయ శాఖ అధికారులతో సంప్రదించినట్లు అధికారులు సానుకూలంగా స్పందించారని ఎప్పటిలాగానే పాత కమిటీతో ఈసారి కూడా జాతర ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా మొగుళ్ళపల్లి మండల ప్రజలతో పాటు ఇతర మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మినీ మేడారం జాతరను విజయవంతం చేయాలని పులి వీరారెడ్డి తెలిపారు,

## రామప్ప ఆలయ సమీప అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం

- మంటల్లో అరుదైన కేన్ మొక్కలు దగ్ధం
- గంటల పాటు శ్రమించి మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది
- ఊపిరి పీల్చుకున్న ఫారెస్ట్ అధికారులు

అక్షరదర్బార్, వెంకటాపురం : ప్రసిద్ధ రామప్ప ఆలయ పరిధిలోని కేన్ మొక్కుల అటవీ ప్రాంతంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పాలంపేటలోని మొక్కల పొదల్లో ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేగంగా వీస్తున్న గాలి కారణంగా మంటలు క్షణాల్లో విస్తరించాయి, మొత్తం ప్రాంతాన్ని దట్టమైన పొగలు కప్పివేసాయి.స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఫైర్ సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో స్పందించినందున భారీ నష్టం తప్పింది, అయినప్పటికీ కొంతమేర మొక్కలు దగ్ధమయ్యాయి.అత్యంత అరుదైన జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన ఈ ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించడం ఫారెస్ట్ అధికారులను షాక్‌కు గురిచేసింది. అగ్నిప్రమాదం మానవ తప్పిదం లేదా ఆకస్మిక పరిణామమా, లేక దుండగుల చర్యలోనా అన్న అంశాలను తేల్చడానికి అధికారులు విచారణ చేపట్టారు.

## తక్కళ్లపల్లి రవీందర్ రావు రాజీనామా..



అక్షర దర్బార్, ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు సోమవారం తన పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గత 26 సంవత్సరాలుగా నన్ను ఆదరించి నాకు సహకరించిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని సోమవారం ఫ్యాక్స్ ద్వారా పీసీసీ చీఫ్ కు పంపించనున్నట్లు తెలిపారు.

## సాంప్రదాయాలకు ప్రతీకలు ముగ్గులు

**చిట్యాల తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా**

అక్షర దర్బార్, చిట్యాల : మన ముంగిళ్లలో వేసే ముగ్గులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తూ ఇంటికి శోభను తీసుకువస్తాయని చిట్యాల తహసిల్దార్ షేక్ ఇమామ్ బాబా అన్నారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో సర్పంచ్ తోట లక్ష్మి అంతయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఎస్సై శ్రావణ్ కుమార్ పాల్గొని పండుగ సందర్భంగా భద్రతా సూచనలు చేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పోతుగంటి సునీత, ద్వితీయ బహుమతి మాసు వనిత, తృతీయ బహుమతి వల్లాల నిరోష అందుకున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915